షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జైపూర్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు కోరారు. ఈ మేరకు హోంమంత్రి డాక్టర్ తానేటి వనితను ఆయన కలిసి వినతిపత్రాన్ని అందించారు.

హోంమంత్రికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరంలో ఫ్యాక్టరీకి వచ్చిన నష్టాల కారణంగా మూసివేశారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీపై మూడు జిల్లాల పరిధిలో 15 మండలాలకు చెందిన రైతులు, కార్మికులు, కర్షకులు ఆధారపడి ఉన్నారని వివరించారు. గతంలో రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు.

మిషన్ వాత్సల్య అందని ద్రాక్షేనా..?

- ఆర్భాటంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 8 నెలలుగా ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అనాథ చిన్నారులను ఆదుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మిషన్ వాత్సల్య అందని ద్రాక్షేనా..? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఈ పథకం కోసం అభాగ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులకు సాయం అందిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. అర్హుల నుంచి దరఖాస్తులు సేకరించి ఎనిమిది నెలలు గడుస్తున్నా మిషన్ వాత్సల్య పథకం నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఈ స్థితికి కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మాతా శిశు సంరక్షణ శాఖ (ఐసిడిఎస్) ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చి నుంచి మిషన్ వాత్సల్య దరఖాస్తులు స్వీకరించారు. మేలో జిల్లా అధికార యంత్రాంగం హడావుడిగా జాబితా సిద్ధం చేసి రాష్ట్ర కేంద్రానికి అందించింది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 6446 మంది తల్లి,దండ్రులు లేని అభాగ్యులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి నిధుల కోసం కేంద్రానికి సిఫారుసు చేయాలి. దీనిపై ఐదు దశల్లో ప్రాథమిక కసరత్తు పూర్తి చేసి జిల్లా యంత్రాంగం రాష్ట్ర కేంద్రానికి పంపించినట్లు తెలుస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. మరోవైపు ప్రతి నెల ఆర్థిక సహాయం వస్తుందన్న ఆశతో బాధిత బాలలు నిరీక్షిస్తున్నారు.

అర్భాటంగా పథకం ప్రకటన

తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా, విడాకులు పొందిన దంపతుల పిల్లలు, తండ్రి కుటుంబాన్ని విదిలేసిన వారికి, తల్లిదండ్రులు ప్రాణాపాయ వ్యాధుల బారిన పడినా, ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాలలు మిషన్ వాత్సల్యకు అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. ఇటువంటి వారికి 18 ఏళ్ల నిండే వరకు నెలకు రూ. 4 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది. మహిళా పోలీసు, అంగన్‌వాడీ, ఆశాల సమన్వయంతో క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించారు. తొలుత గడువు తేదీ నాటికి ధృవపత్రాల అందుబాటులో లేని కారణంగా అర్హులు సైతం దరఖాస్తులు చేసుకోలేకపోయారు. అనతరం గడవు తేదీ పొడిగించడంతో దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వాత్సల్య పథకం ద్వారా లబ్ధి పొందే వారికి ప్రభుత్వం నుంచి ఇతర ఎలాంటి పథకాలు పొంది ఉండరాదని ఉన్నతాధికారుల నుంచి తాజాగా ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 13 వేలు అందుకుంటున్న వారిని వాత్సల్య పథకం నుంచి తొలగించాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

తాత్సారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. దీంతో ప్రజలు, ప్రజాసంఘాలు పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. మిషన్ వాత్సల్య పథకం ప్రారంభించి అభాగ్యులను ఆదుకుంటామని తెలిపింది. ఈ నేపథ్యంలో అనాథలు ఎంతమంది ఉన్నారన్న దానిపై స్పష్టత వచ్చే వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తులు స్వీకరించి నెలల గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలురాలేదని తెలుస్తోంది. దీంతో అనాథ పిల్లలు ఆ పథకం లబ్ధికోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఐసిడిఎస్ పీడీని వివరణ కోరగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు. అర్హులందరికీ మిషన్ వాత్సల్య పథకం అందేలా చూస్తామని వివరించారు.

ఉత్కంఠకు తెర

- బెయిల్‌పై చంద్రబాబు విడుదల
- పోలీసుల అత్యుత్సాహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు షరతులతో కూడిన బెయిల్ రావడంతో ఉత్కంఠకు తెరపడింది. స్కిల్ స్కామ్ కేసులో నారా చంద్రబాబునాయుడు అరెస్టయ్యారు. రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. 52 రోజుల అనంతరం షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు కావటంతో ఆయన మంగళవారం విడుదలయ్యారు. దీంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేపట్టారు. పార్టీ కార్యాలయాల వద్ద బాణ సంచా కాల్చి, స్వీట పంచి అనందాన్ని వ్యక్తం చేశారు. బాబు విడుదలవుతున్నారనే సమాచారంతో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సెంట్రల్ జైలుకు చేరుకున్నారు. టిడిపి శ్రేణులు రాకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షల చట్రం విధించారు. ఒక దశలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసును సిటిఆర్ఐ సెంటర్ వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ వాసు రోడ్డుపై బైఠాయించారు. సాధా రణ ప్రజలకు సైతం ఇబ్బందులు కలిగించేలా పోలీసులు వ్యవహరించిన తీరు పలు విమర్శలకు దారి తీసింది. సెంట్రల్ జైలు రోడ్డుకు వెళ్లేమార్గంలో ఓ వైపు వై.జంక్షన్ వద్ద, మరో వైపు లాలా చెరువు అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసులు బారికేడ్లు అడ్డుగా పెట్టి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

సంఘీభావం తెలిపిన వారందరికీ ధన్యవాదాలు

జైలు నుంచి విడుదలైన చంద్రబాబు పార్టీ శ్రేణులు, అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. తనకు మద్దతుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తను తప్పు చేయనని, తప్పులను కూడా చేయనివ్వబోనని వ్యాఖ్యానించారు. 52 రోజులు పాటు తనకు మద్దతు తెలిపిన ఘటనను జీవితాతంగ గుర్తుంచుకుంటానని తెలిపారు. జైలు నుంచి విడుదలైన ఆయనకు బ్రాహ్మణి, మనువడు దేవాన్ష్, ఎంఎల్ఎ బాలకృష్ణ స్వాగతం పలికారు. జైలు నుంచి బయటకు రాగానే మనవడు దేవాన్ష్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా విజయవాడకు పయనమయ్యారు.

జైలు వద్ద మనువడు దేవాన్ష్‌తో చంద్రబాబు

పోలీసుల తీరుపై విమర్శలు

చంద్రబాబు విడుదల నేపథ్యంలో జిల్లాలో పోలీసులు వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారితీసింది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో తొలి రోజుల్లో సెంట్రల్ జైలు ప్రాంతంలో144 సెక్షన్ ప్రకటించిన విషయం విధితమే. ఆ తర్వాత కూడా కొనసాగింపు చేయడంతో ప్రజలూ ఇబ్బందులకు గురయ్యారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే నాయకులను సైతం నిర్బంధం గురిచేసేందుకు 144 సెక్షన్‌ను పోలీసులు సాకుగా చూపించారు. మరో వైపు జైలులో ఓ ఖైదీ డెంగీతో మరణించడం, పెన్ కెమెరాతో మరో ఖైది లోనికి రావడం వంటి పరిణామాలు పారదర్శకతను ప్రశ్నించాయి. ఉండవల్లి వెళ్తున్న చంద్రబాబును పలకరించేందుకు హైవేపై చేరుకున్న సాధారణ ప్రజలను సైతం అడ్డుకోవటం, కాన్వాయ్‌కు సైతం హైవేలో ట్రాఫిక్ సమస్యలు సృష్టించడం విమర్శలకు దారి తీసింది.

పోలీసుల తీరును నిరసిస్తూ ఆదిరెడ్డి వాసు నిరసన

నన్నయలో మేరా మట్టి మేరా దేశ్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ 1, 2 యూనిట్స్ ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ ప్రోగ్రామ్‌ను మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోరిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశం కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ మేరా మట్టి మేరా దేశ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో దేశభక్తిని నిపుతాయని అన్నారు. ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ వంటి కార్యక్రమాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతా యన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్.పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పిఒలు ఎం.శిరీష, డాక్టర్.డి.అప్పలరాజు, పీడీ డాక్టర్ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. జిల్లాలోని పలు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. **చాగల్లు** మండలంలోని చిక్కాల గ్రామ శివారు చిక్కాల పాలెంలో గ్రామ సర్పంచ్ కోయ.మణి జెఎఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తిరుమల రావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాసిం సాహెబ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశాలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గోకవరం** మండల కేంద్రమైన గోకవరం సచివాలయం-4లో మండల సచివాలయల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు ఆధ్వర్యంలో జెఎఎస్ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల పథకంలో రూ.100కే గ్యాస్ కనెక్షన్

ప్రజాశక్తి - పెరవలి

ఉజ్వల పథకంలో పేద వారికి రూ.100కే గ్యాస్ కనెక్షన్‌ను ప్రభుత్వం అందిస్తుందని తహశీల్దార్ టి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల విజిలెన్స్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. మండలంలోని శిరీష ఇండియన్ గ్యాస్ కంపెనీ వివరాలను తహశీల్దార్ అడిగారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా పేదలకు ఉజ్వల పథకంలో రూ.100 కే గ్యాస్ కనెక్షన్‌ను అందిస్తున్నారని, తెల్ల రేషన్ కార్డు కలిగి 18 ఏళ్లు నిండిన ఎవరైనా ఈ పథకానికి అర్హులని, ఇప్పటికే కనెక్షన్ ఉన్నప్పటికీ వారి పిల్లలు 18 ఏళ్లు దాటితే ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకాన్ని పేద ప్రజలందరూ ఉపయోగించు కోవాలన్నారు. ఎక్కడైనా ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం శిరీష ఇండియన్ గ్యాస్ యజమాని సారమ్మ మాట్లాడుతూ 14.5 కేజీల గ్యాస్ సిలిండర్ స్థానంలో ఫైర్ ప్రూఫ్ ఫైబర్ సిలిండర్స్ ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. అగ్ని ప్రమాదాల్లో ఏ విధమైన డామేజ్ జరగకుండా కొత్త టెక్నాలజీతో తయారైన సిలిండర్ అని వివరించారు. ఈ సమావేశంలో విజిలెన్స్ కమిటీ కో ఛైర్మన్, ఎంపిపి కార్చెర్ల సీతారాం ప్రసాద్, కమిటీ సభ్యులు జడ్పిటిసి కొమ్మిశెట్టి రామాంజాని, ఎంపిటిసి సభ్యులు పల్లేటి రవికుమార్, మత్తుల ఉషారాణి, నక్క పాలేశ్వరరావు, ఎంపిడిఒ డి దామోదర రావు, ఎంఇఒ బి.బాలసుబ్రమణ్య స్వరూప్, కన్వీనర్ సలాది ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మనువాద పాలనకు చరమగీతం పాడుదాం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జువ్వల

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరికి ప్రజలు భారీగా తరలి రావాలని సిపిఎం తూర్పు గోదావరి జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు పిలుపునిచ్చారు. ఈ భేరికి సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.జెపి పాలనలో దేశం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. బిజెపి విచ్ఛిన్నకర రాజకీయాలతో, సమైక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మతం, కులం పేరుతో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో రాష్ట్రంలోని అధికారి వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మోకరిల్లడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మాపు డేనియల్, వివి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఐక్యతా ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కడియం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ఐక్యత ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం షేక్ రఫీయుద్దీన్ ర్యాలీని ప్రారంభించారు. ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, పిడిలు డేవిడ్, వీరబాబుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

విద్యా సంస్థల బంద్ జయప్రదానికి పిలుపు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - గోపాలపురం

నవంబర్ 8న జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని కార్మికులు చేపట్టిన పోరాటం 1000 రోజులు అవుతున్న సందర్భంగా, కడప ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలనే డిమాండ్‌తో జరుగుతున్న విద్యా సంస్థల బంద్‌లో కేజి నుంచి పిజి వరకూ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎ.సునీల్, సిహెచ్ సురేష్, కడిమి శంకర్, ఎంద్రపాటి పేడ్రిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరవలిలో పలు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - పెరవలి

ఎంఎల్ఎను అభినందిస్తున్న గ్రామస్తులు

పెరవలి గ్రామంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే ఎస్‌సి ప్రాంతం లో కల్వర్ట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పెరవలి, ముక్కామల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, వైసిపి నాయకులు వి.సత్యనారాయణ, పి.భద్రయ్య, స్వాతి బాలకృష్ణ, ఎంపిటిసి ఆర్.ప్రమీల కుమారి, తహశీల్దార్ టి.రాజేశ్వరి ఎంపిడిఒ డి.దామోద్రరావు, వ్యవసాయ అధికారి మేరీ కిరణ్, తదితరుతు పాల్గొన్నారు.

50 మంది పిఎంపిలకు పోస్టల్ బీమా

బీమా పాలసీలు చేయిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక ఈశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో మంగళవారం పిఎంపీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి.చిన్ని ఆధ్వర్యంలో 50 మంది పిఎంపీలకు పోస్టల్ బీమా పాలసీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ డాక్టర్ బళ్ళ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని ప్రతి పిఎంపీకి పోస్టల్ బీమా ద్వారా భద్రత కల్పించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి వై.పవన్ కుమార్, ఇ.నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, సిహెచ్ వెంకటేశ్వరరావు, కె.కిరణ్ కుమార్, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక సచివాలయం-2లోని జుట్ట వారి వీధి పాతంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంల హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, మండల ఉపాధ్యక్షులు జె.రామచంద్రరావు, వైసిపి నాయకులు జి.సురేంద్ర కుమార్, జె.ఏడుకొండలు, పంచాయతీ సెక్రెటరీ ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం కోసం వాక్‌థాన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అవినీతి లేని సమ సమాజం ఏర్పాటు కోసం ప్రజలను చైతన్యవంతులను చేసేందుకే ఒఎన్‌జిసి వాకథాన్ కార్యక్రమం నిర్వహిస్తుందని ఒఎన్‌జిసి ఇడి, అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. మంగళవారం ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి ముప్పుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, సత్యం వెల్లివిరిసే వాతావరణాన్ని పెంపొందించేందుకు ఈ 'వాకథాన్' ఒక అడుగు అన్నారు. బాధ్యతాయుతమైన కార్పొరేషన్‌గా, ఒఎన్‌జిసి విజిలెన్స్ విభాగం ద్వారా ప్రతి సంవత్సరం సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచనల మేరకు 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' నిర్వహిస్తుందన్నారు. ఏడాది 'సే నో టు కరప్షన్ కమిట్ టు ది నేషన్' అనే థీమ్ అనే పేరుతో అవినీతిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలను ఒఎన్‌జిసి రాజమండ్రి అసెట్ నిర్వహిస్తుందన్నారు. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్, ఇటీవల తన లంచ నిరోధక నిర్వహణ వ్యవస్థ కోసం ధృవీకరణ పొందిన భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా చరిత్ర సృష్టిం చిందని ఆయన తెలి పారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ బాడీ ఇంటర్‌సర్ట్ యుఎస్ఎ ద్వారా ఈ సర్టిఫికేషన్ లభించిందని వివరించారు. పారదర్శకతను నిర్ధారించడానికి ఒఎన్‌జిసి నిబద్ధత 2005లో ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ ప్రారంభించిన సమగ్రత ఒప్పందాన్ని స్వీకరించిన భారతదేశంలో మొదటి సంస్థగా అవతరించిందన్నారు. 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' ప్రచారం అక్టోబర్ 30న ప్రారంభమై నవంబర్ 8న ముగుస్తుందని తెలిపారు.

వాకథాన్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఒఎన్‌జిసి ఇడి

కార్టూ'నిజం'

కొత్త బిచ్చగాడు... కాదురా ఓట్లడుక్కోవడానికొచ్చినట్టున్నాడు..!!

బాబు బెయిల్‌పై సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయా మండలాల్లో స్వీట్లు పంపిణీ చేశారు.రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్లే క్రమంలో పలు ప్రాంతల్లో ఆయనకు టిడిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. **రాజమహేంద్రరం** స్థానిక సెంట్రల్ జైలు వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేశారు. ముందే దీపావళి వచ్చిందన్నట్లుగా భారీ ఎత్తున టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. **చాగల్లు** చంద్రబాబు బెయిల్ రావడంపై ఆ పార్టీ శ్రేణులు చాగల్లు మెయిన్ బజారులో సంబరాలు చేసుకున్నారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదెళ్ల శ్రీరాం చౌదరి, కోడూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దేవరపల్లి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె సుబ్రహ్మణ్యం, కాట్రు భీమరాజు, కరటూరి శ్రీను, కె.రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **తాళ్లపూడి** చంద్రబాబు బెయిల్‌పై బయటకు రావడంపై టిడిపి శ్రేణులు మండలంలో సంబరాలు చేసుకున్నారు. మండల శాఖ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో తాళ్లపూడిలో బాణాసంచా కాల్చి, కేక్‌కట్ చేశారు. అన్నదేవరపేటలో యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర, తాడిపూడిలో నామ సురేంద్ర, పోచారంలో అనపర్తి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. **పెరవలి** జైలు నుంచి విజయవాడ వెళ్తున్న చంద్రబాబుకు పెరవలి జాతీయ రహదారి వద్ద మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, రవివర్మ, ఎ.రామకష్ణమ్మ(శ్రీను), బి.రామాం జనేయులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లకులవారిపాలెం సెంటర్ వద్ద నిడదవోలు నియోజకవర్గం సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎ.వెంకటనారాయణ, పి.ప్రసాద్, బి.వెంకట నారాయణ, ఇ.సత్యనారాయణ, ఎ.వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. **కడియం** మండలంలోని వేమగిరి జాతీయ రహదారి కూడలి వద్ద టిడిపి, జనసేన శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్ ఆయనకు అభివాదం చేసి కరచాలనం చేశారు. **గోపాలపురం** మండలంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు జరుపుకున్నారు. వేల చింతలగూడెం గ్రామంలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కె.రాము, కె.అన్నవరం, ఎ.మంగారావు, ఎం.రమేష్, జె.శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో బాణాసంచా కాల్చుతున్న టిడిపి నాయకులు

ఆర్యాపురం ఛైర్మన్‌గా జెసి బాధ్యతలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అర్బన్ ఛైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ భరత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఎంఎస్ నెంబర్ 744, వ్యవసాయ మరియు సహకార శాఖ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆరు నెలల కాలపరిమితిపై జెసిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్యాంకుకు ఛైర్మన్‌గా జెసిని, సభ్యులుగా జిల్లా సహకార ఆడిట్ అధికారి, రాజమహేంద్రవరం, సహాయ రిజిస్ట్రార్ (పరిపాలన) డివిజనల్ సహకార అధికారిని నియమిస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి తేజ్ భరత్

నేడు ఉండ్రాజవరం మండల సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జివిఎస్ఆర్‌కె.రాజు మంగళవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పాలకవర్గం సభ్యులతోపాటు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఇందిరా గాంధీకి ఘనంగా నివాళి

ప్రజాశక్తి - చాగల్లు

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభిమానులు మంగళవారం చాగల్లు మెయిన్ బజార్ లోనున్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పంట కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చల్లపల్లి నంది బొమ్మ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. చల్లపల్లికి చెందిన కొరుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు(46) మంగళవారం చల్లపల్లి నంది బొమ్మ సెంటర్ వద్ద పంట కాలువలో కాళ్లు కడుగుకునేందుకు దిగి జారిపడి కాలువలో పడి మృతి చెందారు. మృతునికి భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాణాసంచా సామాగ్రి సీజ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన దీపావళి బాణాసంచా సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన బుర్ర రాంబాబు దీపావళి పురస్కరించుకుని అనుమతులు లేకుండా బాణాసంచా సామాగ్రిని విక్రయించేందుకు తన నివాసంలో నిల్వ చేశాడు. పోలీసులకు వచ్చిన సమాచారంతో అతని గృహాన్ని తనిఖీ చేయగా రూ.10,800 విలువ చేసే బాణాసంచా సామాగ్రిని గుర్తించి రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ

ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ

ప్రజాశక్తి - తాళ్లపూడి

రైతు నుంచి రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు డిప్యూటీ తహశీల్దార్ మరియు విఆర్ఓ పట్టుబడ్డారు. ఎసిబి అడిషనల్ ఎస్పి సౌజన్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మలకపల్లి గ్రామానికి చెందిన రైతు బి.వీర్రాజు తన తండ్రికి సంబంధించిన 10 సెంట్లు వ్యవసాయ భూమి ప్రభుత్వ భూమిగా నమోదు అయిందని, దీనిని సరి చేయాలని విఆర్ఒ శ్రీనివాసును కోరారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ అహ్మద్‌ను కలవాలని విఆర్ఒ సూచించారు. దీంతో డిప్యూటీ తహశీల్దార్‌ను కలవగా ఆ పని కావాలంటే రూ.10 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇద్దరి మధ్య చర్చ అనంతరం ఆఖరికి రూ.7 వేలకు బేరం కుదుర్చుకున్నారు. ఆ నగదును మంగళవారం మలకపల్లి సచివాలయం వద్ద రైతు నుంచి సంబంధిత డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 14400 నెంబర్‌కు ఫోన్ చేయడం కాని, రాజమహేంద్రవరంలోని ఎసిబి కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు.

గ్యాస్‌బండ నుంచి మంటలు.. వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని పైడిమెట్ల గ్రామంలో ఒంటరిగా ఉంటున్న బరిగంటి లక్ష్మి ఇంటిలో మంగళవారం రాత్రి గ్యాస్ బండ లీక్ అయ్యి మంటలు చెలరేగాయి. ఈ ఈ మంటలతో ఆ మహిళకు స్వల్పగాయాలు అయ్యాయి. స్థానిక యువకులు స్పందించి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

పోలీసు, సెబ్ అధికారుల సంయుక్త దాడులు

ప్రజాశక్తి - దేవరపల్లి

పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో దాడులు చేశారు. సెబ్ సిఐ సుధా ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో దాడులు నిర్వహించి పాకా సతీష్ నిల్వ చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన రాపాక జ్యోతి వద్ద నాలుగు మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని ఇరువురిని అరెస్టు చేశారు. మండల కేంద్రమైన గోపాలపురం చెందిన గుబ్బల శ్రీను, కోమటికుంటకు చెందిన ఛుక్కా సుబ్బారావులు నిల్వ చేసిన 1300 లీతర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాతోపాటు, 3 అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ డి. సుధ తెలిపారు. ఈ దాడులలో దేవరపల్లి సిఐ అనసూరి శ్రీనివాసరావు, సెబ్ ఎస్ఐ పి. సుధీర్, దేవరపల్లి ఎస్ఐ శ్రీహరిరావు, గోపాలపురం ఎస్స్ ఐ నరేష్, నల్లజర్ల ఎస్ఐ, సెబ్ సిబ్బంది వెంకన్నబాబు, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలి గ్రామంలో ఫ్లెక్సీల వ్యవహారంలో ఇరువర్గాలకు వచ్చిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల గ్రామంలో ఒక వర్గానికి చెందిన నాయకుని ఫ్లెక్సీ వేరే వర్గానికి చెందిన వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై మూడు రోజులుగా గ్రామంలో తగాదాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీని చింపిన వారు ఒక సామాజిక వర్గం వారని తెలియడంతో మరో సామాజిక వర్గం చెందినవారు సోమవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దొమ్మేటి నీరుబాబు, సాక ఏసుబాబు, బోరా చంటమ్మ తీవ్ర గాయాలు పాలవడంతో ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో ప్రత్తిపాడు సిఐ ఎం.శేఖర్ బాబు, ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం

జగనన్న కాలనీ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపణ

సీఎం పర్యటన ప్రొటోకాల్ పై వాదనలు చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సిఎం పర్యటన సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సామర్లకోట జగనన్న కాలనీలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా చేపట్టిన పలు కార్యక్రమాలకు మున్సిపల్ జనరల్ నిధులను మంజూరు చేయడానికి వీలులేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జీరో అవర్లో అధికార పార్టీ సభ్యులు వైసిపి సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం అజెండా మొదలైన అంశం చదవగానే వైసిపి కౌన్సిలర్లు, కరణం రాజ్ కుమార్ పీతాని కృష్ణ, నేతల హరిబాబు తదితరులు మాట్లాడారు. సిఎం పర్యటనకు కౌన్సిలర్లకు వివిఐపి పాసులు ఇవ్వలేదన్నారు. జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై చైర్మన్ పేరు మినహా కౌన్సిల్ సభ్యుల పేర్లు పెట్టకపోవడం దారుణమన్నారు. కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ సిఎంఓ కార్యాలయం ఆదేశాలమేరకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గతంలో లేని నిబంధన కొత్తగా ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఈ అంశంపై కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సిఎంకు ఆహ్వానం పలుకుతూ కనీసం పత్రికలో ప్రకటన కూడా ఇవ్వకపోవడం దారుణం అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం పర్యటన ఖర్చులు కలెక్టర్ ప్రత్యేక గ్రాంట్ ఇస్తారని గత కౌన్సిల్ సమావేశంలో చెప్పిన కమిషనర్, ఈ సమావేశంలో ఆ ఖర్చులను జనరల్ ఫండ్‌లో ఎలా చూపిస్తారని సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఏపి స్టేట్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ దవులూరు దొరబాబు దృష్టికి తెచ్చే వరకు అజెండాలో ఆమోదించవద్దని డిమాండ్ చేశారు. దీంతో మూడు అంశాలు వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రకటించారు. ఫిల్టర్ బెడ్ లో ప్యానెల్ బోర్డు ఏర్పాటుకు రూ. 4.90 లక్షల ఖర్చు చూపడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని కూడా వాయిదా వేస్తూ అజెండాను కౌన్సిల్ ఆమోదించింది. అత్యవసర కౌన్సిల్ ఎజెండాను కూడా చర్చ లేకుండా ఆమోదించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం నిర్వహణ అధ్వాన్నంగా మారిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్ సహా 15 మంది వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ అరుణ మాట్లాడుతూ పారిశుధ్యంపై కౌన్సిల్ సభ్యులు సంబంధిత సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

చెకుముకితో ప్రతిభా పాటవాల పెంపు

ప్రజాశక్తి - యానాం

చెకుముకి సంబరాలతో విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలు పెంపొందుతాయని జెవివి నాయకులు అన్నారు. యానాం పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి సంబరాల పోస్టర్‌ను జెవివి యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు, హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వీరభద్రరావు మాట్లాడుతూ 10న పాఠశాల స్థాయి, 30న బ్లాక్ స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి పోటీలు జరుగుతాయన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఇందులో పాల్గొనొచ్చన్నారు. వీటిని విజయవంతం చేయాలని ప్రిన్సిపల్, హెచ్ఎంలను జెవివి రాష్ట్ర నాయకుడు కెవివి.సత్యనారాయణ కోరారు.

నాటిక పోటీల్లో నర్సింగ్ విద్యార్థులకు మొదటి స్థానం

ప్రజాశక్తి - యానాం

మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాల విద్యార్థులు డ్రామా పోటీలలో మొదటి స్థానం సాధించారు. యానాం గవర్నమెంట్ మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాల, జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, విద్యార్థులు పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహించిన జిల్లా స్థాయి డ్రామా పోటీలలో యానాం గవర్నమెంట్ మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించి రూ.3 వేల నగదు గెలుచుకున్నారని కళాశాల ఇంచార్జ్ కనకాల శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 3న జరిగే పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయులు ధన కుమారి, సత్యశ్రీలను పరిపాలనాధికారి మునిస్వామి అభినందించారు.

ఆదిత్యలో జాతీయ సమైక్యతా దినం

ప్రజాశక్తి- కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించామని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని సమైక్యతా దినోత్సవంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

ప్రజారక్షణ భేరి జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

ఈనెల 15న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఉదయం 11 గంటలకు జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి కోరారు. మంగళవారం కొత్తపల్లి మండల సిపిఎం కార్యాలయంలో ప్రజా రక్షణ భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణ భేరి అనే నినాదంతో సిపిఎం బస్సు యాత్రలను నిర్వహిస్తుందన్నారు. వీటిని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్.పద్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పారెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, మండల అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ మండల కార్యదర్శి సిహెచ్.సాంబశివకుమార్, ఎం.లక్ష్మి, జి.మంగరత్నం, వి.సత్యనారాయణ, వి.గంగాధర్‌రావు, సిహెచ్.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక మీడియా, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'మీడియా -ప్రజాస్వామ్యంపై దాడులు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ ఐ.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రజాశక్తి సమన్వయ కమిటీ కన్వీనర్ ఎన్.పావనమూర్తి ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతున్న పావన మూర్తి

భారత స్వాతంత్ర్య పోరాటంలో పత్రికలు అద్భుతమైన పాత్ర పోషించాయన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కొంతకాలం ప్రజావాణి వినిపించడం పత్రికలు, మీడియా తమ పాత్ర పోషించి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాయన్నారు. నూతన ఆర్థిక విధానాలు ప్రారంభం అయ్యాక మీడియా సరళిలోనే పెద్ద మార్పు వచ్చిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ కంపెనీలు చెప్పినదే వార్త అన్నట్లుగా మీడియాను మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులను ప్రశ్నిస్తున్న మీడియా సంస్థలు, ప్రతినిధులను లక్ష్యం చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛలో భారత్ స్థానం దిగజారి పోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తాజాగా న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడి, ప్రబీర్ పురకాయస్థ, అమిత్ చక్రవర్తి అరెస్టు అన్యాయమని తెలిపారు. పాలకులు నియంతలుగా మారుతున్నప్పుడు ప్రజా ఉద్యమాలు ద్వారానే రాజ్యాంగ ప్రాథమిక హక్కులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తొలుత ఎలెక్స్ హేలీ రచించిన ఏడుతరాలు నవలను ఆవాజ్ కన్వీనర్ మహ్మద్ ఇబ్రహీం పరిచయం చేశారు. యుటిఎఫ్ నేత దుర్గా దేవి అభ్యుదయ గీతాలు ఆలపించారు. మలక వెంకట రమణ సదస్సుకు స్వాగతం పలుకగా ఎన్.గోవిందరాజులు వందన సమర్పణ చేశారు.

రైల్వే ఛీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఛీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న టి.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం స్టేషన్ సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. శ్రీనివాస్ సేవలను కొనియాడారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, ఛీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, ఛీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఛీఫ్ పార్శిల్ సూపర్‌వైజర్ మూర్తి, ఛీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఛీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ జైన్, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీదేవి, రిజర్వేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 12 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కాకినాడ

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి 12 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సమస్యలను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, డిక్షనరీల అందజేత

ప్రజాశక్తి-రాజోలు

న్యాయవాది, సోషల్ వర్కర్ యాలంగి రమేష్ కుమారుడు యాలంగి సుమిత్ రామారావు 23 వ జయంతి సందర్భంగా కడలి హైస్కూల్ విద్యార్థులకు సుమారు 300 వందలమందికి పెన్నులు, డిక్షనరీలు, పరీక్ష అట్టల మంగళవారం పంపిణీ చేశారు. రిటైర్డ్ ప్రిన్స్ పాల్ గంజి అనంతం అధ్యక్షతన జరిగిన జయంత్యోత్సవ సభకు మాజీ ఎంఎల్ఏ మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర ఉద్యానవన శాఖ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వర రావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని సుమిత్ రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ బోళ్ళ వీర భద్రం, కడలి మాజీ సర్పంచ్ మేడిద శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి 104వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎఐటియుసి జిల్లా కో కన్వీనర్ గిడ్ల చిరంజీవి ఆధ్వర్యంలో 104 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రామచంద్రపురం ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పతాకాన్ని యూనియన్ జిల్లా కార్యదర్శి జి.చిరంజీవి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 104 సంవత్సరాల నుంచి దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులు, వేతనాలు, వేతన చట్టాల కోసం నిరంతరం పోరాడే ఏకైక ప్రజా కార్మిక సంఘం ఎఐటియుసి మాత్రమే అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ పి.సత్తిబాబు, సిసిఎస్ మెంబర్ టి.గన్నియ్య, డిపో అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లే ఔట్ పరిశీలన

ప్రజాశక్తి-ఆలమూరు

గుమ్మిలేరులో జగనన్న నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు లే ఔవుట్ నమూనాను తహశీల్దార్ ఐపి.శెట్టి, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, సర్వే డిటి జానకి రాఘవలు కలిసి మంగళవారం పరిశీలించారు. ముందుగా చదును చేసిన భూభాగంలో ఇళ్ల స్థలాలను విభజించి, పునాది రాళ్లు నాటారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాలకు సంబంధించిన పేద, మధ్యతరగతి లబ్ధిదారులకు సంబంధించిన 1300 ఇళ్ల స్థలాలను ఈ గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. కేటాయించిన ఇంటి స్థలాలను నవంబర్ 8న లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-అమలాపురం

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం అమలాపురంలో డొక్కా సీతమ్మ సంస్మరణ సభ అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక వ్యవస్థాపకులు డా.కత్తిమండ ప్రతాప్ కుమార్ అధ్యక్షతన ఫిలాంత్రోపిక్ సొసైటీ వ్యవస్థాపకులు డా.అద్దంకి రాజా ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం 30 మంది సేవాతత్పరులకు డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారాలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సిబొమ్మిఇజ్రాయిల తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** రెడ్డిపల్లి కి చెందిన కరాటం ప్రవీణ్, నడుపూడి సర్పంచ్ చెల్లిబొయిన నాని లు డొక్కా సీతమ్మ కీర్తి పురస్కారాని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరుల చేతులు మీదుగా అందుకున్నారు.

ఏనుగు మహల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట శివారు ఏనుగుమహల్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్యాంపు శిబిరాన్ని జెడ్‌పిటిసి సభ్యుడు గూడపాటి రమాదేవి, అముడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపిపి మార్గాన గంగాధర్ సందర్శించారు. ఈసందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్న వద్దులు, గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మెరిట్ ఆధారంగానే స్టాఫ్‌నర్స్ నియామకాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మెరిట్ ఆధారంగానే స్టాఫ్ నర్స్ ఉద్యోగాల నియామకాలు చేపడతామని జోన్-2 రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.పద్మశశిధర్ స్పష్టం చేశారు. నోటిఫికేషన్ నెంబర్ 1/2023 ప్రకారం జోన్-2 పరిధిలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు వెయిటేజీ మార్కుల కోసం సమర్పించే సర్వీస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సంబంధిత నియామక అధికారితో ధ్రువీకరించుకోవాలన్నారు. దరఖాస్తు దారులు పని చేసిన కాలానికి సంబంధించిన జీత భత్యాల వివరాలతో ఉన్న బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్, ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ సమయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ధ్రువపత్రాలు నకిలీవని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. నియామకాల విషయంలో మధ్యవర్తులను ఎవరిని నమ్మరాదన్నారు.

ఎస్ బి ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

డ్వాక్రా మహిళలు ఎస్‌బిఐ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్రేయపురం స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం బ్యాంక్ ఆవరణలో డ్వాక్రా సంఘాల మహిళలు గ్రూపులను ఏవిధంగా నిర్వహించాలనే పలు విషయాలు తెలియజేస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. అలాగే పిఎమ్‌జెజెబివై, పిఎమ్ఎస్‌బివై పథకాలను గురించి, ప్రతి వ్యక్తి రూ.1000 చెల్లించి పర్సనల్ యాక్సిడెంట్ పథకంలో కడితే రూ.రెండు లక్షల వరకు యాక్సిడెంట్ కవరేజ్ వర్తిస్తుందని తెలియజేశారు. బంగారం తాకట్టు పై తక్కువ వడ్డీ రేటు తో సులభంగా డబ్బులు తీసుకోవడం. బంగారంపై తీసుకోనే రుణాలకి రూ.3లక్షల వరకూ ఏవిధమైన ప్రాసెసింగ్ చార్జీలు లేవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, క్యాష్ ఆఫీసర్ నారాయణ మూర్తి, సిబ్బంది రామకృష్ణ, త్రిమూర్తులు, ప్రసూన్న, బూషన్ తదితరులు మరియు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం చిక్కం సత్తిరాజు అన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం సత్తిరాజు(సత్రరాజు) వర్ధంతి సందర్భంగా మంగళవారం పేదలకు బియ్యం దుప్పట్లను పంపిణీ చేశారు. గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్ ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గల సత్రరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు సాయం అందజేశారు. కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిక్కం వీర వెంకట సత్య వరప్రసాదరావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక బోధన కోసమే 'సిఎస్' పరీక్ష

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యా విధానంలో గుణాత్మకమైన విద్యా బోధన కోసం స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి మంగళవారం తెలిపారు. 3న జరిగే ఈ పరీక్ష కొత్తపేట వికెవి డిగ్రీ కళాశాల్లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పడిపోయినవి

ముమ్మిడివరం మండలం, గోదాశివారి పాలెం గ్రామంకు చెందిన జగతా సత్తి రాయుడు, తండ్రి: వెంకటేశ్వరరావుకు చెందిన లాండ్ దస్తావేజులు పడిపోయినది. **దస్తావేజులు నెంబర్ 470/2023** జిరాక్స్ నిమిత్తము గోదాశివారి పాలెం నుండి ముమ్మిడివరంకు వచ్చుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

జగతా సత్తిరాయుడు
తండ్రి: వెంకటేశ్వరరావు, గోదాశివారిపాలెం,
ముమ్మిడివరం మండలం,
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్: 9948 447936

ప్రకటన

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా మా క్లయింటు అయిన శ్రీ ముదునూరి సత్యనారాయణ రాజు గారు నిడదవోలు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఓ.యస్.నెం. 95/2016 నెంబరుగా పెద్దెల్ల వీరభద్రరావు అను వారిపై ఇంజక్షన్ దావా దాఖలు చేసి ఉన్నారు. వారు మరణించిన పిదప కోర్టులో వారి వారసులైన పెద్దెల్ల గోవిందమ్మ, భర్త: లేటు వీరభద్రారావు, (2) అన్నమరెడ్డి వీర వెంకట సత్యవతి, భర్త: మురళీ కృష్ణ, తండ్రి: లేటు వీరభద్రరావు (3) చెరుకు విజయ, భర్త: మూర్తి, తండ్రి: లేటు వీరభద్రరావు (4) పెద్దెల్ల పద్మ, తండ్రి: లేటు వీరభద్రరావు అను మీపై దావా దాఖలు చేసి ఉన్నందున శ్రీ కోర్టు వారు **ది.02-11-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు కోర్టు ఎదుట హాజరు కావలసినదిగా ఆదేశించి ఉన్నదున మీరందరు కోర్టుకు స్వయంగా హాజరు అయ్యి మీ వాదనలు తెలియ చేయవలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియచేస్తున్నాము.**

ఎన్.భాస్కరరావు, ఎమ్.కాం.బి.ఎల్.
ఎన్.వి.వి.ఎస్.రామచంద్రరావు, ఎమ్.కాం.ఎల్.ఎల్.బి.
అడ్వకేట్స్, నిడదవోలు.
నిడదవోలు, సెల్: 95505 12541,
31-10-23. 93940 54561

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి తూర్పు గోదావరి అమలాపురం వారి కోర్టులో

I.A.No.101/2019, I.A.No.102/2019
I.A.No.103/2019, in A.S.No.4/2012

పిటీషనర్లు /అప్పిలెంట్లు: పరవస్తు పట్టాభిరాన్ గోవిందాచార్యులు (డైడ్) వగైరాలు

మరియు

రెస్పాండెంట్లు /రెస్పాండెంట్లు: పరవస్తు పట్టాభిరాన్ రామానుజాచార్యులు (డైడ్) వగైరాలు

ఆర్-12: కందదాయ్ చూడామణి, భర్త: రంగనాధస్వామి, డో.నెం. 7-1-22, సహకార నగర్, ఖమ్మం.

ఆర్-13: కందదాయ్ భాగ్యలక్ష్మి, భర్త: వెంకట కృష్ణమాచార్యులు, నెం.4, ఫస్ట్ ఫ్లోర్, రాజ్‌కమల్ లేన్, శ్రీనివాస నగర్, న్యూ పెరుంగలత్తూర్, చెన్నై-63.

పై నెంబరు అప్పీలులో 3వ అప్పిలెంట్ అయిన పరవస్తు పట్టాభిరాన్ ఆండాళ్ గారి వారసులుగా మిమ్ములను రెస్పాండెంట్సుగా చేర్చమని వగైరా పరిహారములు కోరుచూ పిటీషన్లు దాఖలు చేయగా, మీకు సదరు పిటీషన్లులో ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన మూలముగా మీకు తెలియజేయునది ఏమనగా 3 పిటీషన్లు ది.06-11-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. కావున **ది.06-11-2023 న దయం గం॥10:30 ని॥ల లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న ఎడల తెలియజేసుకోవలెను.** లేని ఎడల పిటీషన్లు మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల రిత్యా తెలియజేయడమైనది.

ఎన్.ఎస్.ఎన్.మూర్తి
అమలాపురం, అడ్వకేట్, అమలాపురం.
27-10-23. సెల్: 92900 09559

ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, శృంగవరం గ్రామ కాపురస్తులు **యామన వీరవెంకట సత్యనారాయణ గారి కుమారుడు రవి** గారి సంజాయిషీపై యావన్మందికీ తెలియజయునది ఏమనగా..,

నా క్లయింటు మరియు అతని స్నేహితుడు తొండంగి మండలం, తొండంగి గ్రామ కాపురస్తులు **నాగం పాపయ్య రాజు గారి కుమారుడు పెద వీర్రాజు** గార్లు కలసి జాయింటుగా పెద్దాపురం గ్రామంలో టి.ఎస్.నెం. 3-8-446/3 రు పూరా య.1-74ట్లు, టి.ఎస్.నెం. 3-8-447/3 రు పూరా య.0-68ట్లు వెరసి ఏకప్రతిగా గల య.2-42 ట్లులో య.1-00ట్లు భూమిని ది.10-08-2011 సం॥రం తేదీన గవర నాగమణి వద్ద నుండి కొనుగోలు చేసి పెద్దాపురం సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో **దస్తావేజు నెం. 3575/2011** రుగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. సదరు భూమి నా క్లయింటు మరియు అతని స్నేహితుని యొక్క హక్కుభుక్తములోనే ఉన్నది. వారు వారి యొక్క పని ఒత్తిడి వలన ఆఫీసులకు వెళ్ళడానికి తీరిక లేక ది.12-12-2014 సం॥రం తదీన పెద్దాపురం గ్రామ కాపురస్తులు అయిన పువ్వల సావిత్రి గారి కుమారుడు రాజు గార్కి షరతులతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వ్రాయించి పెద్దాపురం సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో **దస్తావేజు నెం. 4108/2014 రుగా** రిజిస్ట్రేషన్ చేయించినారు. కాగా నా క్లయింటు యొక్క పార్టనర్ అయిన నాగం పెదవీర్రాజు గారు సుమారు రెండు సంవత్సరముల క్రితం మరణించారు. వారి మరణంతో నా క్లయింటు మరియు నాగం పెదవీర్రాజు గార్లు కలసి పువ్వల రాజు గారి పేర వ్రాయించి ఇచ్చిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు ఆటోమేటిక్‌గా కేన్సిల్ అయి పోయినది. కాని పువ్వల రాజు గారు వాస్తవములను కప్పిపుచ్చి తన వారితో కలసి లాలూచి దస్తావేజులు వ్రాయడానికి ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది. కావున ఆల్‌రెడీ రద్దు అయిన దస్తావేజుతో ఏవిధమైన లావాదేవీలు జరిపిననూ అవి మా క్లయింటును బైండు చేయజాలవు. ఈరోజుననే ఈ విషయం పువ్వల రాజు గారికి మరియు పెద్దాపురం ఎస్.ఆర్.ఓ. గార్కి రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపి ఉన్నాము. కావున ఈ విషయం యావన్మందికీ తెలియజేయడమైనది.

రాగం కామేశ్వరరావు
పెద్దాపురం, అడ్వకేట్, పెద్దాపురం.
31-10-23. సెల్: 99895 36800

In The Court Of The Principal Junior Civil Judge Court :: Tanuku
O.S.No. 736/2022

బిట్వీన్:
కొమ్మిశెట్టి నాగేశ్వరరావు ...వాది
మరియు
గ్రంధి కమల ...ప్రతివాది నెం.5

వాది తరుపున చేసిన ప్రకటన

5వ నెంబరు ప్రతివాది: గ్రంధి కమల, భర్త: జి.ఎస్.పి.వి.ఎస్.ఎన్.మూర్తి, హిందువు, స్త్రీ, వయసుస 36 సం॥లు, డో.నెం. 78-16-8/4, కటారి నగర్, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావా గ్రంధములో 5వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన ప్రచురితమైన **తేదీ నుండి 30 రోజులలోగా** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసిందిగాను అట్లు కాని ఎడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

NEELAM HARISH NAIDU
Advocate, D.No.30-4-8,
Behind Lakshmi Theatre, Tanuku.
Cell: 92932 22187

ప్రకటన

అమలాపురం గౌరవ శ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 70/2015

బిట్వీన్:
డా॥పచ్చిగోళ్ళ మధుసూధనరావు వగైరాలు ...వాదులు
అండ్
పచ్చిగోళ్ళ చిన రామస్వామి మరియు వగైరాలు ...ప్రతివాదులు

టు: డి-14: బండారు కళ్యాణి, భర్త: భైరవ కుమార్, C/o. లేటు అరిగెల వెంకన్న నాయుడు, నడిపూడి, అమలాపురం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పైన చెప్పిన దావాలో 14వ ప్రతివాదికి శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిననూ, తీసుకొనక త్రిప్పివేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయునది ఏమనగా **ది.10-11-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తగు ఆక్షేపణలు తెలియచేయవలెను.** లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

కళా వెంకట్రావు
వాదులు తరుపు న్యాయవాది
అమలాపురం. సెల్: 94401 47955